# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 25, నవంబర్ 2025


## నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, నవంబర్ 24, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. అనంతరం కాలేజ్ రోడ్డులో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం వైద్యరంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా

## విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందుతుంది

+ రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్ పట్టణం, నవంబర్ 24, ప్రభాతవార్త**

విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందుతుందని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడు గ్రామంలోని బాలికల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో 13.50 లక్షల వ్యయంతో నెలకొల్పిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను మంత్రి జూపల్లి, అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లతో కలిసి ప్రారంభించారు. విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించిన మంత్రి, ల్యాబ్ లోని పరికరాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ. ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు పెంపుదల కొరకు ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా విద్యార్థుల పరిజ్ఞానం పెంపొందడమే కాకుండా, వారిలో విజ్ఞాన శాస్త్రంపై జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్న కుతూహలం పెరుగుతుందని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఈ ల్యాబ్ ను చక్కగా ఉపయోగి, వారి పరిజ్ఞానం పెరిగేలా బోధనలు జరపాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ, ల్యాబ్ లో పొందుపరిచిన పరికరాల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్యను మిగతా 2లో..

### వడ్డీ లేని రుణాల పంపిణీ ద్వారా

## మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క



**నస్పూర్, నవంబర్ 24, ప్రభాతవార్త**


మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ ద్వారా ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్, ప్రణాళిక శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ మిగతా 2లో..





### ప్రిన్సిపాల్ ఇబ్బందులు పెడుతున్నారంటూ తల్లిదండ్రులకు


## విద్యార్థినిల లేఖ

★ బెల్లంపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ వేధింపులు





**బెల్లంపల్లి, నవంబర్ 24, ప్రభాతవార్త**




అమ్మానాన్న మా ప్రిన్సిపాల్ మానసికంగా వేధింపులకు గురి చేస్తుందంటూ బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులకు రాసిన లేక చర్చనీయాంశంగా మారింది. తమ పాఠశాలలో ప్రిన్సిపల్ రమాదేవి తమని మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఏదైనా అడిగితే మీరు రైతు కూలీ పనులు చేసేవారి బిడ్డలని అవహేళనగా మాట్లాడుతున్నారని లేఖలో తెలిపారు. ఏదైనా పని అడుగుతే డబ్బులు ఇవ్వాలని అప్పుడే చేస్తానని వేధింపులకు పాల్పడుతుందని లేఖలో విద్యార్థినీలు తెలిపారు. వారి తల్లిదండ్రులకు ఇట్టి లేఖను రాస్తూ సోమవారం ఉదయం పాఠశాలకు అందరూ తల్లిదండ్రులతో రావాలని అలాగే మీడియాకు కూడా సమాచారం ఇచ్చి రావాలని విద్యార్థులు లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఉదయం తల్లిదండ్రులు పాఠశాలకు మిగతా 2లో..

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త :**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా యువజన, క్రీడాధికారి అశ్వక్ అహ్మద్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవిలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి షూటింగ్ బాల్ క్రీడా పోటీలలో ఆసిఫాబాద్ జిల్లా జట్టు బంగారు పతకం సాధించిన సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారులకు కొరత లేదని, జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలలో రాణిస్తున్నారని తెలిపారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు రాకేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా

# విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందుతుంది

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులకు అందించేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతుందని అన్నారు.

## విద్యార్థులకు పరిజ్ఞానం అందించేందుకే విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల ఏర్పాటు

**- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

విద్యార్థులకు సైన్సు పట్ల పరిజ్ఞానం పెంపొందేలా విద్యాబోధన అందాల అన్న ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలను నెలకొల్పుతున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ ల్యాబ్ ల ద్వారా విద్యార్థుల్లో కొత్త విషయాలు నేర్చుకోవాలన్న తపన అలవరుతోందని వివరించారు. అంతకుముందు, 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పాఠశాలకు సంబంధించి, పలు మౌలిక వసతుల కల్పన, మరమ్మత్తులకు సంబంధించిన పనులనుప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే కలెక్టర్, తదితరులు భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మంత్రికి అధికారులు విద్యార్థులు పుష్పగుచ్చాలను ఇచ్చి, ఎన్‌సిసి విద్యార్థులు



బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమండ్ అలీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి, డీఈవో భోజన్న, జెడ్పీ సీఈవో గోవింద్, ఎంపీడీవో సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ ఇబ్బందులు పెడుతున్నారంటూ తల్లిదండ్రులకు

# విద్యార్థినిల లేఖ

(మొదటిపేజీ తరువాయి)

చేరుకొని ఆందోళన చేసే ప్రయత్నం చేశారు. దీంతో ప్రిన్సిపల్ ఎక్కడ తన పేరు మీడియాలో వస్తుందని ఉన్నతాధికారులు తమపై చర్యలు తీసుకుంటారని ఆందోళన చెంది తల్లిదండ్రులను, పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థినులను బుజ్జగించే ప్రయత్నం చేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. పాఠశాలకు బయట తాళం వేసి కనీసం ఎవరిని అనుమతించకుండా చేయడంతో, ఈ విషయంపై ప్రిన్సిపాల్ రమాదేవిని ప్రశ్నించగా దాటవేసే సమాధానం చేశారు.

## జ్యోతిబాపూలే పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకుంటాం

**- ఎంఈఓ పోచన్న**

జ్యోతిరావు పూలే పాఠశాలలో ప్రిన్సిపల్ విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సోమవారం ఆందోళనలో చేసిన విషయం తెలిసిందని ఎంఈఓ పోచన్న తెలిపారు. వెంటనే పాఠశాలను సందర్శించి విద్యార్థినిలతో చర్చించి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు.

వడ్డీ లేని రుణాల పంపిణీ ద్వారా

# మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చీరల నాణ్యత బాగుందని ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. మహిళల అభివృద్ధికి మరో అడుగు ముందుకు వేస్తూ వడ్డీ లేని రుణాలు మహిళలకు పెద్ద ఎత్తున అందించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా మరొక విడత పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ప్రతి శాసనసభ నియోజకవర్గంలో మహిళా సమాఖ్యలను భాగస్వామ్యం చేస్తూ నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ చీరల పంపిణీ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని, వడ్డీ లేని రుణాలు ప్రభుత్వ హయాంలో పునః ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మహిళా సమాఖ్య సభ్యులు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను విజయవంతం చేసే దిశగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. వడ్డీ లేని రుణ పథకంలో భాగంగా 304 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందని, మండల, గ్రామ సమాఖ్య సభ్యులతో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో సమావేశాలు నిర్వహించాలని, ప్రతి సభ్యురాలికి నగదు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో నిర్వహించే వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. రెండు పడక గదల ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని, ఇల్లు లేని అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సమాఖ్య సభ్యుల సమన్వయంతో విజయవంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

**- రాష్ట్రంలో మళ్ళీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే - అతివలకు ఆర్థికంగా ప్రభుత్వం అండ**

**- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి - మంత్రి జూపల్లి కృష్ణారావు**

బోథ్, నవంబర్ 24, ప్రభాతవార్త:

కాంగ్రెస్ అంటేనే పేద ప్రజల పక్షపాతి పేదల ప్రభుత్వమని రాష్ట్రంలో మళ్ళీ అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో జరిగిన ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, షాది ముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు పరుస్తోందనీ అన్నారు. మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని ఇందులో భాగంగా మహిళ సంఘాలకు పెట్రోల్ పంపుల ఏర్పాటు, మహిళలకు వడ్డీలేని రుణాల మంజూరు, ఆర్టీసీ బస్సుల కొనుగోలు, సోలార్ ఎనర్జీ ఉత్పత్తి వంటి కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు పరుస్తోందనీ ఆయన అన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, 500 వందలకే గ్యాస్ సిలిండర్ అందజేత వంటి కార్యక్రమాలను అమలు పరుస్తోందనీ అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ కట్టుకునేలా చూడాలని



ఆర్థికంగా లేని వారికి మహిళ సంఘాలు, బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చూసి ఇంటి నిర్మాణంను పూర్తి అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి లబ్ధిదారులతో వాట్సప్ గ్రూప్ లను ఏర్పాటు చేసి ఆ గ్రూప్‌లలో అధికారులు ఉండేలా చూడాలని తెలిపారు. బోథ్ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయండి ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంత్రిని కోరారు. బోథ్‌లో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లను నిర్మించాలని, నియోజకవర్గ కేంద్రంకు మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేలా చూడాలని మంత్రిని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు కష్టమైన సరే ఇంటిని నిర్మించుకోవాలని ఆయన సూచించారు. అభివృద్ధికి మరిన్ని నిధులను మంజూరు చేయాలని ప్రత్యేకంగా విన్నవించారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరలను, మహిళ సంఘాలకు రుణాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్, కళ్యాణ లక్ష్మీ త్రి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నగేష్, డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా రెడ్డి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్, రాజేశ్వర్, ఐటిడీఏ పీఓ యువరాజ్ మర్మాట్, ఆర్డీఓ స్రవంతి, ఆయా మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు ఇతర అధికారులు మహిళలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ఆసిఫాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త :

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్‌లతో కలిసి దరఖాస్తుదారుల నుండి అర్జీలను స్వీకరించారు. జైనూర్ మండలం నాయక్ తండాకు చెందిన జాదవ్ సుజాత తన భర్త మరణించినందున ఆయన పేరిట ఉన్న భూమిని తన పేరిట విరాసత్ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. అదేవిదంగా జిల్లా కేంద్రానికి చెందిన పెంద్రం సత్యవతి తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని, దహేగాం మండలం లగ్గాం గ్రామానికి చెందిన కొండ్ర భాస్కర్ గౌడ్ తాను గీత కార్మికుడిని అయినందున లైసెన్స్ మంజూరు చేయాలని,తిర్యాణి మండలం చెలిమెల కోలాంగూడ గ్రామానికి చెందిన టేకం గంగారాం తన పట్టా భూమిని ఇతరులు కబ్జా చేసినందున తగు విచారణ చేసి నాకు న్యాయం చేయాలని, జైనూర్ మండల కేంద్రంలోని ఎస్.సి. కాలనీకి చెందిన దుదనే శ్రీమంత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, సిర్పూర్ టి మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అమీనొద్దీన్ తాను బోరింగ్ మెకానిక్ గా పని చేస్తున్నానని,తనకు రావలసిన 4 నెలల వేతనాన్ని ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సంబంధిత వివరాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల భీమా పెంపు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, నవంబర్ 24, ప్రభాతవార్త

భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంబంధించిన బీమా పెంచడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో మంచిర్యాల రాజ్యసభ మండల అధికారి శ్రీనివాస్ రావు, సహాయ కార్మిక కమిషనర్ పి.నరసింహస్వామి, అధికారులతో కలిసి బీమా పెంపు సంబంధిత గోడ ప్రతులు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులకు సంబంధించిన ప్రమాద బీమా క్రింద లబ్ధి మొత్తాన్ని 6 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని, సహజ మరణం క్రింద లబ్ధి మొత్తాన్ని 1 లక్ష రూపాయల నుండి 2 లక్షల రూపాయల వరకు పెంచడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 3వ తేదీ వరకు మంచిర్యాల సహాయ కార్మిక శాఖ అధికారులు మండలాల వారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి కార్మికులకు ప్రమాద బీమా ఆవశ్యకతపై వివరించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన కార్మికులు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రమాదవశాత్తు పూర్తి శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం, ప్రమాదవశాత్తు పాక్షిక శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి 4 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. వివరాల కొరకు సహాయ కార్మిక అధికారి కార్యాలయాలను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి సత్యనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

### - చెన్నూరు రూరల్ సీఐ బన్సిలాల్

**వేమనపల్లి, నవంబర్ 24, ప్రభాతవార్త**

నీల్వాయి పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం మంగళవారం రోజు దాస్నాపూర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని చెన్నూరు రూరల్ సీఐ బన్సిలాల్ తెలిపారు. ఇట్టి శిబిరానికి పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొనడం జరుగుతుందని, కావున మారుమూల ప్రజలకు కంటి పరీక్షలు అందించాలి అనే లక్ష్యంతో పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి శిబిరానికి ప్రముఖ కంటి వైద్యులు పాల్గొనున్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఉదయం 7 గంటల వరకు రాగలరని పేర్కొన్నారు.




## బీసీలకు అన్యాయం చేస్తున్నారంటూ తహసిల్దార్‌కు వినతి

**బెల్లంపల్లి, నవంబర్ 24, ప్రభాతవార్త**

బీసీలకు ప్రభుత్వం అన్యాయం చేస్తున్నారని బీసీ నాయకులు గంధం తిరుపతి, పనస గణేష్, బత్తుల రమేష్, మార్త బాపులు తాసిల్దార్ కృష్ణకు సోమవారం వినతి పత్రం అందజేశారు. బెల్లంపల్లి మండలంలో 17 గ్రామ పంచాయతీలకు బిసి రిజర్వేషన్ సంబంధించి బీసీలకు 42 శాతం అంటే 7 సర్పంచ్ రిజర్వేషన్లు రావాల్సి ఉండగా, కనీసం పాత పద్ధతిలో 23 శాతం ఇచ్చిన నాలుగు స్థానాలు రిజర్వేషన్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పుడు ఇచ్చిన రిజర్వేషన్లు బెల్లంపల్లి మండలంలో రెండు రిజర్వేషన్లు ఇచ్చి బీసీలకు అన్యాయం చేశారని దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

## సింగరేణి బెల్లంపల్లి ఏరియాలో ఈడి పర్యటన

**బెల్లంపల్లి, నవంబర్ 24, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ఏరియాలో ఈడి (కోల్ మూమెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్ రెడ్డితో కలిసి సోమవారం రోజున పర్యటించారు. ఉదయం జనరల్ మేనేజర్ కార్యాలయంలో అన్ని విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఏరియా స్థితిగతులపై చర్చించారు. అనంతరం ఖైరిగుర ఉపరితల గని వ్యూ పాయింట్ నుండి గనిని పరిశీలించారు. గనిలో పని ప్రదేశాలకు చేరుకొని కోల్ బెంచ్ లను చూశారు. ఉత్పత్తి, రవాణా విషయంలో అధికారులకు సూచనలిచ్చారు. బ్లాస్టింగ్ పనులు చేస్తున్న మహిళ ఉద్యోగులను అభినందించారు. వట్టి వాగు రక్షణ కట్టను పరిశీలించారు.తదుపరి గోలేటి సిహెచ్పి కి చేరుకొని మొక్కలు నాటారు. బొగ్గు డంపింగ్, దుమ్ము లేవకుండా చేపడుతున్న చర్యలను వీక్షించారు. బొగ్గులో వ్యర్థాలు రాకుండా చుసుకోవాలన్నారు. రైల్వే ట్రాక్, వాగన్ లోడింగ్ ప్రదేశాన్ని చూసి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు నాలుగు ర్యాక్‌లు లోడ్ అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరిగుర పిఓ మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, సిహెచ్పి ఇంచార్జి కోటయ్య, మేనేజర్ జే.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత

**లక్షెట్టిపేట, నవంబర్ 24, ప్రభాతవార్త**



మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని లక్షెట్టిపేట ఏఎంసీ డైరెక్టర్ పోల్సని రవీందర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని రంగపేట గ్రామంలో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళల కోసం అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, నవంబర్ 24, ప్రభాతవార్త**

విద్యార్థులు, యువత భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల నియంత్రణపై మంచిర్యాల డిసిపి భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, జిల్లా ఆబ్కారీ మద్యనిషేధ శాఖ అధికారి నందగోపాల్, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు వెంకటేశ్వర్లు, రవికుమార్, డ్రగ్ ఇన్స్పెక్టర్ చందన, మానసిక వైద్య నిపుణులతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాలను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాలు, గంజాయి ఇతరత్రా మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, క్లబ్ ఏర్పాట్లు ఇతర వివిధ రకాల పద్ధతుల ద్వారా అవగాహన కల్పించాలని, మానసిక వైద్య నిపుణులచే శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు వివరించాలని, మాదకద్రవ్యాల నియంత్రణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని, విద్యార్థుల అసాధారణ ప్రవర్తనను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డ్రగ్స్ రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని, ఇన్‌పేషెంట్ సేవలకు కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మందుల దుకాణాలు, ఆసుపత్రులలో అందించే గుర్తించిన ప్రత్యేకమైన డ్రగ్స్ పై రిజిస్టర్ నిర్వహించాలని, వైద్యుల సూచన మేరకు మాత్రమే మందులు విక్రయించాలని, మత్తు మందుల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మెడికల్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటిఐ, జూనియర్, డిగ్రీ కళాశాలలలో మాదకద్రవ్యాలు, మద్యం వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థినీ, విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించాలని, గురుకులాలు, వసతిగృహాలు, అన్ని విద్యా సంస్థలలో ప్రహరీ, కారిడార్లు, పరిసరాలు స్పష్టంగా కనిపించే విధంగా సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. బెల్ట్ షాపులు, గుడుంబా స్థావరాలపై పోలీసులు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, అకస్మాత్తుగా కార్డన్ సెర్చ్ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు. మంచిర్యాల డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన మాదకద్రవ్యాల సంబంధించి 2025 సంవత్సరంలో 55 కేసులు నమోదు కాగా 156 మంది అరెస్టు అయ్యారని, 41 కిలోల గంజాయిని స్వాధీన పరుచుకోవడం జరిగిందని, మాదకద్రవ్యాల తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధించడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100లో సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రధానంగా డ్రగ్స్ ఉత్పత్తి, రవాణాను అరికట్టడంలో టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా చెకోపోస్టుల వద్ద విస్తృత తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ జిల్లాలోని మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సరైన అనుమతులు లేని దుకాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు వైద్యుల సూచన లేకుండా మందులు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

## ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**నిర్మల్ పట్టణం, నవంబర్ 24, ప్రభాతవార్త**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కార్మిక శాఖకు సంబంధించిన, కార్మికుల ప్రమాద బీమా పెంపు సమాచార గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## బీసీలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**జన్నారం, నవంబర్ 24, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వం బీసీలకు హామీ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండానే ఎన్నికలకు వెళ్లడం ఎంతవరకు సమంజసమని, ఎన్నికలకు వెళ్లడం బీసీలను మోసం చేసినట్లేనని సోమవారం రోజున మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకులుగా మాత్రమే చూస్తున్నాయని విమర్శించారు. జన్నారం మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉన్నాయని, అందులో కేవలం రెండు మాత్రమే చిన్న గ్రామపంచాయతీలైన చింతలపల్లి, బాదంపెల్లి గ్రామాలను బీసీలకు కేటాయించడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తంచేశారు.మండలంలో బీసీలకు 7 సర్పంచ్ స్థానాలను కేటాయించాలని ఈ రోజు ఎంపీడీవో ఉమర్ షరీఫ్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, అది మా పరిధిలో లేదని చెప్పడంతో ప్రధాన రహదారిపై రాస్తారోకోకు చేపట్టామని తెలిపారు. రాస్తారోకో చేపట్టడంతో రహదారికి ఇరువైపులా వాహన రాకపోకలు నిలిచిపోయాయి స్థానిక పోలీసులు అక్కడికి వచ్చి వారిని సముదాయించి రాస్తారోకో విరమింప చేశారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్, బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కో కన్వీనర్ కడార్ల నర్సయ్య , మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపిటిసి కొంతం శంకరయ్య, పొనకల్ మాజీ ఉపసర్పంచ్ బిసి మంచిర్యాల జిల్లా కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపిటిసి రాగుల శంకర్, మోకు దెబ్బ మంచిర్యాల డివిజన్ అధ్యక్షుడు ఒల్లాల నర్సా గౌడ్, ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆంధ్ర పురుషోత్తం, మండల బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి సంద గోపాల్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్, పూసల సంఘం మాజీ అధ్యక్షుడు గుడ్ల రాజన్న, విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు లెక్కల మల్లయ్య, ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గోపి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపాదనను అమలు చేయాలి



ఏజెన్సీ ప్రాంతంలో కారిడార్ రోడ్డు ప్రతిపాదన అమలు చేయాలని తెలుపుతున్న నాయకులు

**లింగాపూర్, నవంబర్ 24, ప్రభాతవార్త :**

లింగాపూర్ జన్నారం,కవ్వల్, లింగాపూర్, పంగడి మాదోరా, ఆసిఫాబాద్ మీదుగా కారిడార్ రోడ్డు ప్రతిపదనను అమలు చేయాలని లింగాపూర్ మండల వాసులు సోమవారం లింగాపూర్ మండల కేంద్రం లో మీడియా సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తునటువంటి కారిడార్ రోడ్డు నిర్మాణాల ప్రతిపధనలో హైవే అలైన్‌మెంట్ ఆప్షన్ 5ను ఆమోదించన్నడ తో కొమరం భీం ఆసిఫాబాద్ జన్నారం కవ్వలా లింగాపూర్ మీదుగా పంగడి మాధోరా ఆసిఫాబాద్ హైవే అయితే ఇక్కడి ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు, నాగ్‌పూర్ హైదరాబాద్ హై స్పీడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియ ప్రతిపాదించిన ఐదు అలైన్‌మెంట్ ఎంపికలలో ఐదవ ఎంపికను తక్షణమే ఖరారు చేయాలని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల ప్రజలు కేంద్రాన్ని,రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అలైన్‌మెంట్ ఆమోదం పొందకపోతే,తమ ప్రాంత ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సుమారు 80 నుండి 120 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి న దుస్థితి ఏర్పడుతుందని స్థానిక ప్రజా ప్రతినిధులు,లింగాపూర్ గ్రామ నివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. 120 కి.మీ అదనపు భారంనేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సిఫార్సు చేసిన జఅలైన్‌మెంట్ ఆప్షన్ 1 మా జిల్లా కేంద్రాలకు, ముఖ్యంగా కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల వంటి పట్టణాల నుండి హైదరాబాద్‌తో ప్రత్యక్ష అనుసంధానాన్ని కల్పించడం లేదు. దీని ఫలితంగా, అత్యవసర వైద్య సేవలు లేదా తక్షణ పనుల కోసం ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాలంటే అనవసరంగా సుదీర్ఘంగా చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది.అలైన్‌మెంట్ ఆప్షన్ ఐదు మా ప్రాంతం అయిన లింగాపూర్ పంగిడిమదోరా తిర్యాని మండలాల గుండా వెళితే, అత్యవసర పరిస్థితుల్లో హైదరాబాద్‌కు చేరుకునే దూరం గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం మేము లింగాపూర్ నుండి హైదరాబాద్ చేరుకోవడానికి సుమారు 80 నుండి 120 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఈ దూరం అత్యవసర సమయాల్లో ప్రాణాలను తీసే ప్రమాదం ఉంది. అందుకే మా ప్రాంత ప్రజలకు ఆప్షన్ ఐదు ఒక జీవన రేఖ వంటిది అని లింగాపూర్ గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేశారు.కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలు తమ ప్రాంత ఎంపీ అయిన గౌరవనీయులు శ్రీ గెడ్డం నగేష్ గారికి విజ్ఞప్తి చేస్తూ, తక్షణమే ఈ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అలైన్‌మెంట్ ఆప్షన్ ఐదు ను ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మా ప్రజల అత్యవసర అవసరాలను తీర్చడానికి మరియు ప్రాంతీయ అభివృద్ధిని సాధించడానికి ఇది ఏకైక పరిష్కారం. ఈ ముఖ్యమైన ప్రాజెక్ట్‌ను వేగవంతం చేయడానికి ప్రభుత్వాల సహకారం మరియు జోక్యం ఎంతో అవసరం ఉందని అన్నారు, ఈ కార్యక్రమం లో జాదవ్ శ్రీకాంత్, ఆడే సురేష్, లింగాపూర్ యూత్ అధ్యకుడు జాదవ్ దరమెందర్, మాజీ ఎంపిటిసి బలరాం, రాథోడ్ వినోద్, జాధవ్ రవీందర్, రమేష్, శంకర్, సుదం, రవీందర్,ప్రకాష్, ఉత్తమ్ బాధిపటేల్, తదితర గ్రామల ప్రజలు మండల ప్రజలు పాల్గొన్నారు.



ఇందిర మహిళా శక్తి చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

*** ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ఉట్నూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**

కోటి మంది మహిళలను కోటిశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రగతి కోసం, మహిళలను ఉన్నత స్థాయిలో ఉంచడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పతకాలు తెస్తోందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహిళల పట్ల అపారమైన గౌరవంతోనే, మీకోసమే అన్ని రంగాల్లో పతకాలను తెస్తూ, అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. పెద్ద ఎత్తున మహిళలు, మహిళా సంఘ నాయకులు హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్లు రాని ప్రతి ఒక్కరికి వచ్చే విడతలో ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మహిళా సంఘ సభ్యులు, మహిళలు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- ఉట్నూర్ ఐటిడిఏ పరిపాలన అధికారి దామోదర స్వామి**

**ఉట్నూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**



అర్జీలను స్వీకరిస్తున్న ఐటిడిఏ ఉపసంచాలకులు అంబాజీ

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిపాలన అధికారి దామోదర స్వామి అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల మండలం కన్నపాల్ గ్రామానికి చెందిన శంకర్ తనకు బొలెరో వాహనం మంజూరుకు, ఉట్నూర్ మండలం సాకేరా గ్రామానికి చెందిన పద్మావతి తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో వర్కర్ ఉద్యోగం ఇపించమని, తలమడుగు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన రాజు తనకు కిరాణా లోన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీలను సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పించన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా పరిపాలన అధికారి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

## ఇందిరమ్మ చీరల పంపిణీ

**నార్నూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమలో ఇందిరమ్మ చీరలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి మహిళలకు సోమవారం పంపిణి చేశారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఇంచార్జ్ చైర్మన్ సురేష్ ఆడే, ఎంఆర్ఓ రాజలింగు, ఎంపీడీఓ పుల్లారావ్, ఎపిఎమ్ రాజారామ్, డైరెక్టర్ కాంతారావ్ లోఖండే దేవరావ్, బ్రీజులాల్, మహిళలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక అధికారిని సన్మానిస్తున్న వేలాల గ్రామ ప్రజలు

## వేలాల ప్రత్యేక అధికారికి ఘన సన్మానం

**జైపూర్, నవంబర్ 24, ప్రభాతవార్త**

వేలాల గ్రామ ప్రత్యేక అధికారి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అనుమాల విద్యసాగర్‌ను సోమవారం గ్రామస్థులు ఘనంగా సన్మానం చేశారు. రెండు సంవత్సరాలుగా గ్రామానికి ఉత్తమ సేవలు అందించారని, ఉద్యోగం బాధ్యతమాత్రమే కాదు. గ్రామంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహం నిర్మాణం కోసం 45 వేల రూపాయలు అందించారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 25 వేల రూపాయల విలువగల ఆఫీసు రూంలో టైల్స్ వేయించారని అన్నారు. గ్రామం ముఖద్వారం వద్ద 1,50,000 రూపాయల విలువ గల హనుమాన్ విగ్రహం ఏర్పాటుకు హామీ ఇచ్చారని అన్నారు.



## జైపూర్‌లో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి కళ్యాణ మహోత్సవం

**జైపూర్, నవంబర్ 24, ప్రభాతవార్త**

జైపూర్ మండల కేంద్రంలో సోమవారం శ్రీ దేవి-భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి.వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామివారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భూదేవి-శ్రీదేవి సమేత మలయప్ప స్వామి కళ్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. కళ్యాణ దర్శనానికి జైపూర్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు.కళ్యాణం అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణలో రథంపై గ్రామ వీధుల గుండా ఊరేగించారు.మహిళలు సంప్రదాయ వేషధారణలో కోలాటాలు ఆడుతూ, యువత భజనలు చేస్తూ భక్తి పారవస్యంలో గోవింద, గోవింద నామస్మరణ చేశారు. బ్రహ్మోత్సవాల అనంతరం నిర్వాహకులు అరవింద్‌రావు అన్నదానాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలు జమ్మికుంటకు చెందిన అర్చకులు శ్రీ రామాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జైపూర్ పరిసర గ్రామాల భక్తులు విస్తృతంగా పాల్గొని స్వామివారి దివ్య ఆశీర్వచనాలు పొందారు.

## మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయి గుర్తింపు రావడంలో జిల్లా కలెక్టర్ కృషి అభినందనీయం

**నస్పూర్, నవంబర్ 24, ప్రభాతవార్త**

కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మహిళా సంఘాల సభ్యులతో కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయి పురస్కారాలలో మొదటి 3 స్థానాలలో మంచిర్యాల జిల్లా స్థానం సంపాదించి అవార్డుతో పాటు 2 కోట్ల రూపాయల నగదు పురస్కారాన్ని పొందింది.



# బీసీ వ్యతిరేకంగా విడుదల చేసిన జీవో పత్రాల దహనం

## - బీసీ మహిళా జేఏసీ కన్వీనర్ పేరం అలేఖ్య

**మంచిర్యాల, నవంబర్ 24, ప్రభాతవార్త**

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు బీసీలకు వ్యతిరేకంగా తీసిన జీవో నెంబర్ 46ను రద్దు చేయాలని, బీసీ మహిళా జెఏసి కన్వీనర్ జీవో నంబర్ 46 పత్రాలను కాలబెట్టిన బీసీ జేఏసీ నాయకులు మంచిర్యాల బీసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తా అన్న కాంగ్రెస్ పార్టీ, శనివారం రోజున జీవో నెంబర్ 46 జారీ చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ ప్రజలను రాజకీయంగా అనగతొక్కడానికి,బీసీలకు తీవ్రని అన్యాయాన్ని చేసిందని నిరసనగా మార్కెట్ చౌరస్తా, మంచిర్యాల నందు జీవో నంబర్ 46 పత్రాలను తగలబెట్టారు. ఈ సందర్భంగా బీసీ మహిళా జేఏసీ జిల్లా కన్వీనర్ అలేఖ్య, బీసీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ వడ్డేపల్లి మనోహర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీ ప్రజలకి 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి, ఈ రోజున కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని కుంటి సాకులు చెబుతూ, కేంద్ర మీద పోరాటం కూడా చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 46 ఇస్తూ పాత రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పడం అంటే బీసీ ప్రజలను వంచించి మోసం చేయడమే అని అన్నారు, మన మంచిర్యాల జిల్లాలో 300 స్థానాలు స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలు ఉంటే కేవలం 9 స్థానాలు బీసీలకు కేటాయించడం జరి గిందని, పాత రిజర్వేషన్ల ప్రకారం అయినా 22 బీసీలకు 33 సీట్లు దక్కాలి. కానీ, 9 సీట్లే ఏ రకంగా బీసీ ప్రజలకు రిజర్వేషన్ కల్పించిందని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నెన్నెల, మందమర్రి, మండలం భీమారం, కోటపల్లి మండలంలో మొత్తంగానే ఒక్క సర్పంచ్ సీటు కూడా బీసీ ప్రజలకు కేటాయించకుండా, బీసీ ప్రజలను అవమానించారని, అక్కడ మా బీసీ ప్రజలు లేరా అని,మొత్తానికి మొత్తంగా జనరల్ స్థానాలను పెట్టుబతూ అగ్రవర్ణాల అధిపత్యాన్ని కొనసాగించడం కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తుందని అన్నారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా బీసీ ప్రజలు ఎక్కడికక్కడ ఉద్యమాలు చేయడం జరుగుతుందని, దానిలో భాగంగానే మంచిర్యాల జిల్లాలో బీసీ ప్రజలు రాజకీయంగా ఎదగాకుండా చేస్తున్న ఈ జీవో నెంబర్ 46 పత్రాలను దగ్ధం చేస్తున్నామని, ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం బీసీ ప్రజల ఆకాంక్షల కోరిక మేరకు ఈ జీవోను రద్దుచేసి, బీసీ ప్రజలకు దక్కాల్సిన 42 రిజర్వేషన్ను కల్పిస్తూ స్థానిక సంస్థలు ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా నాయకుడు కొండిల్ల శ్రీనివాస్, తులా మధుసూదన్, అడ్వకేట్ నటేశ్వర్, కట్టుకోజు రమణ, యోగానంద, మద్ది వేణుగోపాల్, బిసి జేఏసీ స్టూడెంట్ నాయకులు పూరేల్ల నితీష్, తదితరులు పాల్గొన్నారు.



జీవో పత్రాలు దహనం చేస్తున్న బీసీ నాయకులు



కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్న నాయకులు

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**వేమనపల్లి, నవంబర్ 24, ప్రభాతవార్త**

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో భాగంగా సోమవారం మండలంలోని నీల్వాయి, కేతనపల్లి, దాస్నాపూర్, వేమనపల్లి గ్రామాలలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ తో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించడం జరుగుతుందని అన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2389తో 500 బోనస్, సాధారణ రకం ధాన్యానికి 2369 రూపాయిల మద్దతు ధర అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గాలి మధు, పున్నం, రామచందర్, శంకర్, రమేష్, నాయకులు పూర్ణచంద్రారెడ్డి, మధుసూదన్, పురుషోత్తం, ఉప్పలపు సాయి, రాజారాం, శ్రీనివాస్, వినోద్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షుడిగా ఏట రవి

**వేమనపల్లి, నవంబర్ 24, ప్రభాతవార్త**



బిజెపి మండల అధ్యక్షుడిగా ఏట రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రోజున మండల కేంద్రంలో బిజెపి మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్నికలు, భవిష్యత్ కార్యక్రమంపై చర్చించారు. ఇటీవల మరణించిన బిజెపి మండల అధ్యక్షులు ఏట మధుకర్ కుమారుడు అయిన ఏట రవి ని వేమనపల్లి మండల బిజెపి అధ్యక్షుడిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో కృషి చేస్తానని రానున్న స్థానిక ఎన్నికల్లో బిజెపి జెండా ఎగిరే విధంగా కష్టపడుతానిని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదర్శ దంపతులను సన్మానించిన చైర్మన్

**సారంగాపూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరొందిన దిలావర్పూర్ మండలానికి చెందిన కదిలి పాపాహరేశ్వరాల యం సోమ వారం ఓ ప్రత్యేక దృశ్యానికి వేదికైంది. ఆస్ట్రేలియాలో స్థిరపడిన ఆదర్శ దంపతులు కార్తీక్-హానీ ఆలయాన్ని సందర్శించి పరమేశ్వరుడి దర్శనం చేసుకున్నారు. మూడు సంవత్సరాల క్రితం నిర్మల్కు చెందిన కార్తీక్, ఆస్ట్రేలియాకు చెందిన హనీ హిందూ సంప్రదాయం ప్రకారం ప్రేమవివాహం చేసుకొని దాంపత్య జీవితం కొనసాగిస్తున్నారు. స్వదేశానికి వచ్చిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ నార్వాడే వెంకట్రావు వారిని శాలువాతో సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ మాధవరావు, పూజారులు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు, ఆర్మూర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన జిల్లా నాయకులు

**సారంగాపూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ను సోమవారం జిల్లా కేంద్రంలోని ఐబి గెస్ట్హౌస్లో పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రత్యేకంగా కలిసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. అదే విధంగా నిర్మల్ జిల్లా మాజీ జడ్పీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి పార్టీ అధ్యక్షుడిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండీ రాజేశ్వర్, పాకాల రాంచందర్, నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమాండ్ అలీ, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అహ్మద్ ముక్తార్, సారంగాపూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాకుపెల్లి సురేందర్, మండల కాంగ్రెస్ నాయకులు దశరథ్, రాజేశ్వర్, అడెల్లి రాజేశ్వర్ రావు, ఉట్ల రాజేశ్వర్, ఒల్లత్రి నారాయణ రెడ్డి, ఇస్మాయిల్, ఎండీ రాకేష్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా సమిష్టిగా పని చేయాలని నాయకులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

## జాతీయస్థాయి క్రీడా-సాంస్కృతిక పోటీలు

### మందమర్రి కార్మెల్ పాఠశాలలో ప్రారంభం

**మందమర్రి, నవంబర్ 24, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో గల కార్మెల్ పాఠశాల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వాలీబాల్, కోకో, బాస్కెట్బాల్, ఎస్సే రైటింగ్, డ్రాయింగ్, డాన్స్, పోయెట్రీ మరియు ఉపన్యాస పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ రెండు రోజుల కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన 30 పాఠశాలల నుండి 1000 మంది విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొనడం విశేషం. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిషప్ జోసెఫ్ తచ్చా పరంబత్, ప్రొఫెసర్ ఫ్రాన్సిస్ జేవియర్, ప్రొఫెసర్ దూసి రవిశేఖర్, రజిత కాంచనపల్లి (హెల్త్ కేర్ ప్రొవైడర్, నెదర్లాండ్స్), కార్మెల్ అకాడమీ డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ జెవిఆర్ రెక్స్ హాజరయ్యారు. ముఖ్య అతిథులు సాంప్రదాయ పద్ధతిలో జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, క్రీడాస్ఫూర్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రెండు రోజులపాటు వివిధ క్రీడలు మరియు సాంస్కృతిక విభాగాల్లో పోటీలు కొనసాగనున్నాయి. చివరి రోజు విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ

**బజార్హత్నూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ఇందిర మహిళా శక్తి చీరలను ఏపీఎం వెంకట్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు టీ శంకర్ యాదవ్, పురుషోత్తం, ఈశ్వర్, వివోఏలు ప్రగతి, రాజ్యలక్ష్మి, సుజాత, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



చీరల పంపిణీ చేస్తున్న ఏపీఎం

## ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ఏర్పాటు

**బజార్హత్నూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం కొల్హారి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ జ్ఞానేశ్వర్ శీతాకాల శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కే సునీల్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం అనేది విద్యార్థుల యొక్క ఉజ్వల భవిష్యత్తుకు, నాయకత్వపు లక్షణాలకు ఒక వరం లాంటిదని, సామాజిక సేవ దృక్పథాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని, విద్యార్థులను పలు సూచనలు చేశారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులకు మొదటి రోజు పరిసరాల పరిశుభ్రత, ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడిఏ ఇంచార్జి పిఓ



# ఉపాధ్యాయులే విద్యార్థి జీవిత మార్గదర్శకులు

**- ఐటిడిఎ ఇంచార్జి పిఓ యువరాజు మర్మాట్**

**ఉట్నూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయులే విద్యార్థి జీవిత మార్గదర్శకులని ప్రతి విద్యార్థి యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దే మహా క్రతువును ఉపాధ్యాయులే నిర్వహిస్తారని అందుకుగాను ఉపాధ్యాయులు నిరంతరం తమను తాము లక్ష్యాలు ఏర్పాటు చేసి తమ నైపుణ్యాలను మెరుగుపరుస్తూ నాణ్యమైన విద్యను అందించాలని ఐటిడిఎ ఇంచార్జి పిఓ యువరాజు మర్మాట్ అన్నారు. సోమవారం పిఎంఆర్ కాంప్లెక్స్‌లో ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల ప్రధానోపాధ్యాయులు జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించుటకు విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలని అన్నారు, ఉపాధ్యాయ శిక్షణ తరగతులు లోగో, ఉపాధ్యాయ కరదీపికలను డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ కలిసి ఆవిష్కరించారు. అన్ని కేటగిరీలో ఉపాధ్యాయుల విడతల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ జగన్, టి దేవరావు, ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

## విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం

**బెల్లంపల్లి, నవంబర్ 24, ప్రభాతవార్త**



డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ కాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు సీఎంపిఎఫ్ కోల్ మైన్స్ పెన్సన్ రినివల్ చేసుకోవడం పట్ల గోలేటి జిఎం కార్యాలయంలో సీఎంపీఎఫ్ అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. ఇకపై పెన్సన్, రినివల్ మీసేవ కేంద్రాల్లో మాత్రమే కాకుండా మన సెల్ ఫోన్ ద్వారా చేసుకోవచ్చని వివరించారు. ప్రాక్టికల్‌గా సెల్ ఫోన్‌లో సంబందిత వివరాలతో రినివల్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, డిజిఎం (ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, సీఎంపిఎఫ్ అధికారులు శ్రీనివాస్, మనోహర్, పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి ఎం. శ్రీనివాస్, ఏటిబి సెల్ ఇంచార్జి డి. ప్రశాంత్, క్లర్క్‌లు, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు

**సిర్పూర్ (టి), నవంబర్ 24, ప్రభాతవార్త :**



పండ్లు పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

ఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను షేక్ చాంద్ నివాసంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కేక్‌కట్ చేయించి బిఆర్ఎస్ నాయకులతో కలిసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలోబిఆర్ఎస్ మండల అధ్యక్షుడు అస్లాంబిన్ అబ్దుల్లా ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సామాజిక న్యాయం విద్య ద్వారా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసే నాయకుడు అని కొనియాడారు. బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచే నాయకుడా అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షేక్ చాంద్, పనాస లక్ష్మణ్, సునీల్, శుభం, అమీర్, భీమ్రావు తదితరులు పాల్గొన్నారు.

## టిబి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి

**- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రసన్న**

**తాండూర్, నవంబర్ 24, ప్రభాతవార్త :**

టిబి వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రసన్న కోరారు. టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అచ్చులాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి ఓపి పరీక్షలు, 35 మందికి తెమడా, 12 మందికి ఎక్స్ రే పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధి పూర్తిస్థాయి నివారణకు కేంద్ర ప్రభుత్వం టిబి ముక్త్ భారత్ పేరిట ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చెమటలు పట్టడం, గొంతు భాగంలో గడ్డలు ఏర్పడడం తదితర లక్షణాలు టిబి వ్యాధికి సంబంధించి ఉంటాయన్నారు. అటువంటి లక్షణాలు ఉండి టిబి నిర్ధారణ అయితే చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు ఝాన్సీ, సూపర్ వైజర్లు తారాబాయి, రమాదేవి, సి హెచ్ ఓ ప్రసన్న, పంచాయతి సెక్రెటరీ కల్పన, ఏఎన్ఎంలు ప్రవీణ, పారిజాత, పుష్పలత, ల్యాబ్ టెక్నీషియన్ హకీమ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



టిబి వ్యాధి నిర్ధారణ పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్, వైద్య సిబ్బంది




అవగాహన కల్పిస్తున్న పివిఆర్ కన్స్ట్రక్షన్స్ దుర్గం ప్రశాంత్

## ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సైబర్ మోసాల పట్ల అవగాహన

**వాంకిడి, నవంబర్ 24, ప్రభాతవార్త :**

వాంకిడి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం పివిఆర్ కన్స్ట్రక్షన్స్ దుర్గం ప్రశాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేకంగా సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలో వేగంగా పెరుగుతున్న సైబర్ మోసాల నేపథ్యంలో విద్యార్థులకు రక్షణ చర్యలపై పూర్తి అవగాహన కల్పించడం కార్యక్రమంలో సోషల్ మీడియా దుర్వినియోగం, హ్యాకింగ్, ఓటిపి ఫ్రాడ్, ఫేక్ కాల్స్, ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్స్ వంటి సైబర్ నేరాలు యువతను ఎక్కువగా టార్గెట్ చేస్తున్నాయని వివరించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు ఎవరికీ పంచుకోకూ డదని, తెలియని లింక్స్‌పై క్లిక్ చేయరాదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్, ఫాకల్టీ తిరుపతి, కిరణ్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖోబ్రగాడే విలాస్, శివాజీ, గణేష్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు కొల్హారి విద్యార్థి ఎంపిక

**బజార్‌హత్నూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**



మండలంలోని కొల్హారి గ్రామానికి చెందిన అర్షియా నస్రీన్, రవుఫ్ ఖాన్ దంపతుల కుమారుడు దానిష్ ఖాన్ అండర్ 17 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఆడే రామేశ్వర్ తెలిపారు. కాగా దానిష్ ఖాన్ గౌతమ్ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. ఆదిలాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి ఆదిలాబాద్ జట్టులో ఎంపికైనట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, మండల వాసులు దానిష్ ఖాన్‌ను ప్రశంసించారు.



## విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించిన మంత్రి

**సారంగాపూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**

రాష్ట్ర ఎక్సైజ్ ప్రోహిబిషన్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, అదిలాబాద్ ఎంపి గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ సోమవారం సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడు గ్రామంలోని బాలికా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో రూ. 13. 50 లక్షలతో నెలకొల్పిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించారు. ఈ ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మకమైన విద్య అందుతుందని మంత్రి అన్నారు. అనంతరం ప్రయోగశాల పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలు, లంబాడీల మధ్య చిచ్చు పెడుతున్నారు

**నేరడిగొండ, నవంబర్ 24, ప్రభాతవార్త:**

విభజించు పాలించు రాజకీయాలతో ఆదివాసీలు, లంబాడీల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని గిరిజన-లంబాడీల ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆరోపించారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ జాదవ్ మాట్లాడుతూ ఉట్నూర్‌లో ఆదివాసీ పోరుసభలో చేసిన వ్యాఖ్యలతో లంబాడీల మనోభావాలను దెబ్బతీశారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలన్న వ్యాఖ్యలు ప్రజాస్వామ్యపరమైన విలువలకు విరుద్ధమని, రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ వీటిని పక్కనపెట్టి ఆదివాసీ-లంబాడీల మధ్య ఘర్షణలు రేపే ప్రయత్నాలు తగదని తెలిపారు. లంబాడీలు కష్టపడి చదువుకుని ఉద్యోగాలు సంపాదించారని, చట్టబద్ధంగానే ఎస్టీ జాబితాలో ఉన్నామని గుర్తుచేశారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే, ఆదివాసీ సమాజం వైపు మొగ్గుచూపుతూ విభజన రాజకీయాలకు ఆస్కారం కల్పించడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. లంబాడీలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఆపకపోతే భారీ స్థాయిలో ఆందోళన కార్యాక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ పాండు రాథోడ్, మండల నాయకులు సతీష్, అర్జున్, సునీల్ రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మహేందర్

# బెజ్జూర్ పిహెచ్సికి నూతన వైద్యాధికారి

**బెజ్జూర్, నవంబర్ 24, ప్రభాతవార్త :**



బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నూతన వైద్యాధికారిగా తాళ్లపల్లి శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఈయన స్వగ్రామం మండలంలోని మర్తిడి సొంత మండలంలోనే వైద్య సేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మణచందా వీడీసీ సభ్యులు, గ్రామ ప్రజలు

# మద్యం దుకాణాలు ఊరుబయటకు తరలించాలి

## - గ్రామ సభ్యుల ఫిర్యాదు

**లక్ష్మణచందా, నవంబర్ 24 ప్రభాతవార్త:**

లక్ష్మణచందా మండల కేంద్రంలోని లైసెన్సు పొందిన వైన్స్ దుకాణాలను గ్రామ ప్రజల సౌకర్యార్థం ఊరుబయటకు తరలించాలని లక్ష్మణచాంద విడిసి సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం నిర్మల్ సమీకృత కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం దుకాణాలు ప్రస్తుతం రైతువేదిక, పాఠశాలలు, కుటుంబాల నివాసాలు, దేవాలయాలు, చర్చిలకు సమీపంలో ఉండటం వల్ల మహిళలకు, విద్యార్థులకు అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. మద్యం దుకానాలను గ్రామం చివరన ఏర్పాటు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్‌కు రచయితల బృందం ఫిర్యాదు చేశారు. మద్యం దుకాణాలు ఊరుబయటే ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ పిర్యాదులో గ్రామ అభివృద్ధి కమిటి సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఎస్పి నితిక పంత్

**ఆసిఫాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త :**



కుమురం భీం జిల్లాకు నూతన ఎస్పిగా నియమితులైన నితికా పంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలపై దృష్టి సారించి ఎలాంటి నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# డీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఆత్రం సుగుణ

**ఆసిఫాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త :**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా నియమితులైన ఆత్రం సుగుణక్క సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తరువాత ఇద్దరూ జిల్లా పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సమీకరణ, రాబోయే కార్యక్రమాల ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మండలస్థాయి నుండి గ్రామస్థాయి వరకు పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకునే సూచనలు, అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ..తనపై ఉంచిన విశ్వాసానికి పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు మాసడే చరణ్, యూత్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, దుర్గం ప్రశాంత్, దీపక్, దుర్గం రవీందర్, మహేష్ గౌడ్, సిడాం తిరుపతి, డి. శ్రీనివాస్,సిడాం తిరుపతి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.



మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావును సన్మానించిన ఆత్రం సుగుణక్క

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, నవంబర్ 24, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాల ప్రాంతానికి చెందిన అల్లి లచ్చయ్య తనకు వేంపల్లి శివారులో గల పట్టా భూమిలో ఇబ్బందికరంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను మరొక చోటికి మార్చాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రౌతు అనిల్ తమ గ్రామంలో దాదాపు 800 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి ధాన్యం సాగు చేస్తున్నామని, తాము ధాన్యం విక్రయించుకునేందుకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీవాసులు తమ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా చేస్తున్న భవన నిర్మాణంపై తగుచర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ తన దరఖాస్తులో 2021-25 విద్యా సంవత్సరాలలో జరిగిన బిఎఎస్‌లో సీట్లు పొందిన విద్యార్థుల జాబితా పై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రతినిధి నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ తన దరఖాస్తులో స్థానిక సంస్థల ఎన్నికలలో జిల్లాలో రిజర్వేషన్ ప్రకారం బిసిలకు స్థానాలను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

# బీజేపీలో భారీగా చేరికలు

**ఉట్నూర్, నవంబర్ 24, ప్రభాతవార్త:**



కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానిస్తున్న రితేష్ రాథోడ్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రాలకు, జిల్లాలకు అనేక నిధులు మంజూరు చేస్తున్నారని ప్రజలు రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులకు ఆదరించాలని బిజెపి పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ అన్నారు. సోమవారం ఉట్నూర్‌లోని ఆయన నివాసంలో బిజెపి పార్టీ మండల శాఖల ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ టేకం హరిప్రసాద్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, ఉట్నూరు మండల అధ్యక్షులు బింగి వెంకటేష్, ఎస్టి మోర్చా జిల్లా కార్యదర్శి రాథోడ్ శేషారావు, నాయకులు సీపతి లింగాగౌడ్, బొడ్డు కిరణ్, కాల్వ రవి, ఉగ్గే విజయ్, చింతల రమణ, బి జితేందర్. బూత్ అధ్యక్షులు జాదవ్ సతీష్, పులి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

## - అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

**ఆదిలాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త:**



అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన దరఖాస్తుదారులు తమ సమస్యలను వ్యక్తిగతంగా వివరిస్తూ సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను కేసు వారీగా నమోదు చేసి, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన భూమి వివాదాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, సంక్షేమ పథకాల లబ్ధి, నివాస ధృవీకరణలు, మౌలిక వసతుల వంటి అనేక అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు అందిస్తూ తక్షణ స్పందనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె చూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల ప్రభావం మారుమూల గ్రామంలో ఎక్కువ

**కెరమెరి, నవంబర్ 24, ప్రభాతవార్త:**



మత్తు పదార్థాల ప్రభావం మారుమూల గ్రామాల్లో ఎక్కువగా ఉంటుందని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్ అన్నారు. సోమవారం కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామ పంచాయతి పరిధిలోని కోలంగూడ గ్రామంలో పోలీసులు మీకోసం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎస్పీ నితిక పంత్ హాజరై, కొలంగూడ, జోడేఘాట్ గ్రామ వృద్ధులకు 50 దుప్పట్లు పంపిణీ చేశారు. యువతకి వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మారుమూల, అటవి ప్రాంతాల్లో నివసించే గిరిజనుల భద్రత కోసం పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని, గ్రామాలకు తరచూ చేరుకుని ప్రజల సమస్యలను తెలుసుకునే విధంగా పోలీసుల కార్యకలాపాలు కొనసాగిస్తామని తెలిపారు. మత్తుపదార్థాల సమస్యలు మారుమూల గ్రామాల్లో ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం ఉన్నందున గ్రామ పెద్దలు, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు మీకోసం" కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి పోలీస్ శాఖ మరింత చేరువవ్వే లక్ష్యంతో, ప్రజల అవసరాల ప్రకారం సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎఎస్పీ చిత్తరంజన్, సీఐ సత్యనారాయణ, ఎస్సై కేరమేరి మధుకర్, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




# ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీని రేపట్లోగా పూర్తి చేయాలి

## - ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ఆదిలాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త:**

ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీని రేపట్లోగా పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లాలోని అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాదులో నుంచి ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత గల సంఘాలకు వడ్డీ రహిత రుణాల కింద రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని 6964 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.3 కోట్లు 3 లక్షలు విడుదలైనట్లు తెలిపారు. రేపు (నవంబర్ 25, 2025)న అన్ని నియోజకవర్గాల్లో స్థానిక శాసన సభ్యుల ఆధ్వర్యంలో వడ్డీ రహిత రుణాల చెక్కులను స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లా కు కేటాయించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీని రేపు సాయంత్రం లోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో నిర్మితమైన 982 రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలియజేశారు. దీనిపై స్పందించిన ఉపముఖ్యమంత్రి, వీటి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. అదేవిధంగా పిఎంఏవైజి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సర్వే వివరాలను వెంటనే నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, హౌసింగ్ నోడల్ అధికారి షకీర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతకు మందమర్రి పోలీసుల చర్యలు

**– సారంగపల్లి, చిర్రకుంట గ్రామాల పరిధిలో గల బిటి రోడ్డులో పిచ్చి మొక్కల తొలగింపు**

**– ప్రమాదాల నివారణకు ప్రజలను భాగస్వామ్యం చేసిన మందమర్రి ఎస్సై**

**మందమర్రి, నవంబర్ 24, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా, మందమర్రి పోలీసులు సోమవారం రోజున చిర్రకుంట, సారంగపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సారంగపల్లి, చిర్రకుంట గ్రామాల పరిధిలో గల బీటీ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కల వలన రహదారి వెడల్పు తగ్గిపోయి, ఎదురెదురుగా వచ్చే వాహనదారులకు దృష్టి గోచరత తగ్గి, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని గుర్తించిన పోలీసులు ఈ కార్యాచరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సారంగపల్లి మరియు చిర్రకుంట గ్రామాల ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని, పోలీసులకు సహకరించారు. ఈ సందర్భంగా మందమర్రి ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మందమర్రి ఆవడం మరియు చిర్రకుంట బీటీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను ప్రజల సహాయంతో తొలగించడం జరిగిందని, తద్వారా రోడ్డు యొక్క పూర్తి వెడల్పును పునరుద్ధరించి, రోడ్డు ప్రమాదాలు



నిర్వహించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, సహకరించిన సారంగపల్లి మరియు చిర్రకుంట గ్రామ ప్రజలకు పోలీస్ శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, దీనికి ప్రతి పౌరుడి భాగస్వామ్యం, అంకితభావం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణ కోసం ఎస్సై రాజశేఖర్ ప్రజలకు కొన్ని ముఖ్య సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని ఆయన సూచించారు. రోడ్లపై నిర్ణీత వేగ పరిమితిని పాటించడం అతి ముఖ్యం, అతి వేగం ప్రాణాలకు ప్రమాదకరం. ముఖ్యంగా, మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరం కాబట్టి, ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనం నడపవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అదనంగా, వాహనదారులు తమ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్ వంటి అన్ని వాహన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని, రహదారి మలుపుల వద్ద, దృష్టి గోచరత తక్కువగా ఉన్న ప్రదేశాలలో మరింత అప్రమత్తంగా, నెమ్మదిగా వెళ్లాలని ఆయన కోరారు. మందమర్రి పోలీసులు ప్రజల భద్రతకు నిరంతరం కృషి చేస్తారని, రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

# ఓపెన్ కాస్ట్ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణపై యూనియన్ నాయకులతో సమీక్ష

**మందమర్రి, నవంబర్ 24, ప్రభాతవార్త**

మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం ఎన్.రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (ఫేజ్–2) కోసం 03.12.2025న నిర్వహించనున్న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సోమవారం ఉదయం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేతలతో, సాయంత్రం కార్మిక సంఘాలైన ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, సిఐటియు, హెచ్ఎంఎస్, బీఎంఎస్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓపెన్ కాస్ట్ ఫేజ్–2 ప్రాజెక్ట్ అభివృద్ధి, స్థానిక ఉపాధిపై దాని ప్రభావం, సింగరేణి సంస్థ ప్రగతి వంటి అంశాలపై నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను విజయవంతం చేసి, ప్రాజెక్ట్ పురోగతికి అన్ని యూనియన్ నాయకులు సహకరించాలని జీఎం ఎన్.రాధాకృష్ణ కోరారు. ఇది సింగరేణి అభివృద్ధికి, అలాగే ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా–పరోక్షంగా ఉపాధి పొందుతున్న ప్రతి కార్మికుడి భవిష్యత్తుకు దోహదం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జీఎం లలితేంద్ర ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచెస్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ అశోక్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, ఐఈడీ ఎస్.ఇ. కిరణ్‌కుమార్, కె.వెంకట రెడ్డి (అడిషనల్ మేనేజర్–ఎన్విరాన్మెంట్), రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు రమణ, ఐఎన్‌టీయూసీ నాయకులు కాంపల్లి సమ్మయ్య (సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్), దేవి భూమయ్య (ఏరియా వైస్ ప్రెసిడెంట్), సిఐటియు నాయకులు వెంకటస్వామి (ఎస్‌సిఇయు సిఐటియు వైస్ ప్రెసిడెంట్), అల్లి రాజేందర్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్ (ఏరియా వైస్ ప్రెసిడెంట్), బడికెల సంపత్, బీఎంఎస్ నాయకులు డి.రమేష్, ప్రదీప్‌కుమార్ (ఏరియా సెక్రటరీ), హెచ్ఎంఎస్ నాయకులు పార్వతి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**మంచిర్యాల, నవంబర్ 24, ప్రభాతవార్త**

తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ మంచిరాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కమిటీ సభ్యులు లెక్కల సాగర్ మాట్లాడుతూ నాలుగు కొత్త కార్మిక లేబర్ కోడ్ల వలన దేశంలో ఉన్న కార్మిక వర్గానికి మరియు మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ తీవ్ర అన్యాయం జరుగుతుందని మరియు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కును కూడా కాలరాసేలా ఈ చట్టాలు ఉన్నాయని అలాగే మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ కోసం ఏర్పాటు చేయబడిన సేల్స్ ప్రమోషన్స్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976 కూడా రద్దు చేయడంతో దేశవ్యాప్తంగా పనిచేస్తున్న మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతన చట్టం, బోనస్ చట్టం, గ్రాట్యూటీ చట్టం ఇలాంటి ఎన్నో చట్టాల అమలు ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ పని ప్రదేశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి 24, 25, 26 తేదీలలో పనిచేయడం జరుగుతుంది అని తెలుపుతూ, ప్రభుత్వం దిగివచ్చి తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ని వెంటనే రద్దు చేయాలి, సేల్స్ ప్రమోషన్స్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976ని పునరుద్ధరించాలి, మెడికల్ అండ్ సేల్స్ రిప్రెంటేటివ్స్‌కి చట్టబద్ధమైన పని విధానాలు రూపొందించాలి. ధర్నా కార్యక్రమం నిర్వహించిన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ద్వారా తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజటేటివ్స్ యూనియన్ నాయకులు తమ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ కమిటీ సభ్యుడు ఎల్. సాగర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. కుమార్, వావిలాల. సంతోష్, ఉపాధ్యక్షులు సిహెచ్. రామకృష్ణ, అధిక సంఖ్యలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల ప్రక్రియ పునఃపరిశీలన

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, నవంబర్ 24, ప్రభాతవార్త**

రాజ్యాంగ నిబంధన, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం, జనాభా ప్రాతిపదికన ప్రకారం ఎస్.సి., ఎస్.టి. రిజర్వేషన్ వారి జనాభా సంఖ్య కంటే తక్కువగా ఉండకూడదని, అదే విధంగా మొత్తం రిజర్వేషన్స్ 50 శాతానికి మించకూడదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలు 2025 సందర్భంలో బి.సి. డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా జిల్లాలోని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ పునః పరిశీలన చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 306 గ్రామపంచాయతీలు, 2 వేల 680 వార్డు సభ్యుల స్థానాలకు ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్న నియమావళి ప్రకారం రిజర్వేషన్ ప్రక్రియ పునః పరిశీలన చేయడం జరిగిందని తెలిపారు. భీమారం మండలంలో ఎస్.సి. 30.2 శాతం, ఎస్.టి. 20.15 శాతం (మొత్తం 50.35 శాతం) బి.సి. 0, కాసిపేట మండలంలో ఎస్.సి. 21.06 శాతం, ఎస్.టి. 29.40 శాతం (మొత్తం 50.46 శాతం), బి.సి. 0, కోటపల్లి మండలంలో ఎస్.సి. 37.77 శాతం, ఎస్.టి. 9.63 శాతం (మొత్తం 47.4 శాతం), బి.సి. 0, మందమర్రి మండలంలో ఎస్.సి. 33.41 శాతం, ఎస్.టి. 16.39 శాతం (మొత్తం 49.8 శాతం), బి.సి. 0, నెన్నెల మండలంలో ఎస్.సి. 29.96 శాతం, ఎస్.టి. 15.20 శాతం (మొత్తం 45.16 శాతం), బి.సి. 0, ప్రకారంగా నమూనా రిజర్వేషన్లలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు కేటాయించినట్లయితే నిబంధనల ప్రకారం 50 శాతం రిజర్వేషన్ దాటుతుందని, ఈ కారణంగా వెనుకబడిన తరగతులకు (బి.సి.లకు) రిజర్వేషన్ల కేటాయింపు జరగడం లేదని తెలిపారు. తదుపరి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# బిజేపి ఆధ్వర్యంలో రిజర్వేషన్లు సవరించాలని కలెక్టర్‌కి వినతిపత్రం

**మంచిర్యాల, నవంబర్ 24, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం తప్పుల తడకగా బీసీ రిజర్వేషన్ కేటాయించి మరొకసారి బీసీలకు అన్యాయం చేసిన సందర్భంగా రిజర్వేషన్లు సవరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల తడకగా రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. మంచిర్యాల జిల్లాలో 306 సర్పంచ్ స్థానాలు ఉంటే కేవలం 21 స్థానాలు మాత్రమే బీసీలకు కేటాయించారని ఆయన తెలియజేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తామని జీవో ఇచ్చి బీసీలను నయవంచనకు గురి చేసిందన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధి లేని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన తెలియజేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని చెప్పి బీసీలు ఎక్కువగా ఉండే గ్రామాల్లో కేవలం ఏడు శాతం కేటాయించి బీసీల పట్ల పక్షపాత వైఖరి చూపించిందన్నారు. బీసీలను ఈ ప్రభుత్వం బిచ్చగాళ్ళలా చూస్తుందని ఆయన మండిపడ్డారు. కోటపల్లి మండలంలో భీమారం మండలంలో 50 శాతం ఓసీలకు రిజర్వేషన్ చేసి ఒక్కటి కూడా బీసీల కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. చెన్నూరులో రెండు స్థానాలు కేటాయించి బిచ్చగాల్లలా బీసీ లను చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన బీసీ డిక్లేషన్ హామీని 42 శాతం రిజర్వేషన్ హామీని విస్మరించి ప్రభుత్వం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని అన్నారు. కేవలం ఏడు శాతం రిజర్వేషన్ మంచిర్యాల జిల్లాలో అమలు చేయడం పట్ల బీసీల ఆత్మగౌరవని దెబ్బతీయడమేనని ఆయన అన్నారు. తక్షణమే రిజర్వేషన్ల అంశాన్ని పునరాలోచించి బీసీలకు గతంలో ఉన్న మాదిరిగా చట్టబద్ధంగా కనీసం 22 శాతం రిజర్వేషన్ జిల్లాలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు జోగుల శ్రీదేవి, పబ్బతినేని కమలాకర్ రావు, కోటపల్లి మాజీ ఎంపీపీ మంత్రి రామయ్య, నాగేశ్వర్ రావు, మంచిర్యాల కార్పొరేషన్ వివిధ జోన్ల అధ్యక్షులు, అమీరిశెట్టి రాజు కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

# నేటి నుంచి మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులు అందించాలి

**3ఆసిఫాబాద్ ప్రతినిధి, నవంబర్ 24, ప్రభాతవార్త :**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25 నుంచి మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ములుగు జిల్లా నుండి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన, సెర్ప్ సి ఈ ఓ దివ్య దేవరాజన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణ అభివృద్ధి అధికారులు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ మంగళవారం నుంచి మహిళలకు చీరల పంపిణీ తో పాటు అన్ని నియోజకవర్గ కేంద్రాలలో మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీకి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనం సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సమాఖ్య సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 25న జిల్లాలోని కాగజ్ నగర్, ఆసిఫాబాద్ డివిజన్ కేంద్రాలలో శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణం లో నిర్వహించే దిశగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.






# మహిళా శక్తీకరణే లక్ష్యం

## మంత్రి జూపల్లి



**ఆదిలాబాద్, నవంబర్ 24, ప్రభాతవార్త:**

మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. సోమవారం ఆదిలాబాద్ ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్ర మాన్ని మంత్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళలు గృహాల్లో మాత్రమే కాకుండా, సమాజ నిర్మాణంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. మహిళలు గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో అమలు



అవుతున్న పథకాలు ఇప్పటికే లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని మంత్రి వెల్లడించారు. మహిళల ఆదాయ వనరులను పెంపొందించేందుకు, యజమానులను చేసేందుకు ఆర్టీసీ బస్సులు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ పంపుల ఏర్పాటు చేస్తున్నామనిచెప్పారు. ఇందువల్ల కుటుంబ ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ. 22 వేల కోట్లు కేటాయించామని, ప్రతి నియోజకవర్గంలో 3,500 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుని పొదుపు సంస్కృతి పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు మహిళా సంఘాలకు రూ. 21.83 కోట్ల శీబీబి రుణాల చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జి. నాగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, డీసీసీబీ చైర్మన్ బోజరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, శ్యామలాదేవి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్, డీఆర్‌డీఓ రవీందర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించిన సింగరేణి సెక్యూరిటీ జీఎం

**జైపూర్, నవంబర్ 24, ప్రభాతవార్త**

సింగరేణి (సెక్యూరిటీ) జనరల్ మేనేజర్ చందా లక్ష్మీనారాయణ సోమవారం మంచిర్యాల జిల్లా, జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా (పి.సి.ఎస్.ఓఎం) జిఎం మదన్మోహన్ స్వాగతం పలికారు. ఈ సందర్శనలో సెక్యూరిటీ జీఎం ఎపవర్ ప్లాంట్‌లో ఉన్న సెక్యూరిటీ పోస్టులను తనిఖీ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న మూడో యూనిట్ ప్రాంతాన్ని, మిథనాల్ ప్లాంటును ఏరియా స్టోర్స్ ను పరిశీలించారు. మూడో యూనిట్ పనులు జరుగుతున్నందున ప్లాంటుకు వెళ్ళే దారిని మళ్ళించి, ప్లాంటు మేటిరియల్ గేటు పక్కన కార్మికుల కోసం మరో ఏర్పాటు చేసిన గేటును తనిచ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ థర్మల్ పవర్ ప్లాంటులో నిఘా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలను చేశారు. సెక్యూరిటీ సిబ్బంది విధి నిర్వహణలో భాధ్యతగా ఉండాలన్నారు. భద్రతా పరంగా ఏమైనా సమస్యలు ఉంటె వెంటనే పై అధికారులకు తెలియజేయలన్నారు. మూడో యూనిట్ కి సంబంధించిన పనులు జరుగుతున్నాయనీ, సంబంధించిన సామాగ్రి లోడింగ్, అన్లోడింగ్ వంటివి సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట మరికొన్ని సెక్యూరిటీ పోస్టులను అదనంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సింగరేణిలో 36 సంవత్సరాలు సుదీర్ఘసేవలు అందించి ఈ నెల 30 న పదవి విరమణ పొందనున్న (సెక్యూరిటీ) జీఎం చందా లక్ష్మీనారాయణను అధికారులు ఉద్యోగులు శాలువాతో సన్మానించి, మేమెంటోను అందించారు.ఈ కార్యక్రమంలో పిసిఎస్, ఓఎం జీఎం మదన్మోహన్, పర్సనల్ డీజీఎం కిరణ్ బాబు,వాటర్ సిస్టం డీజిఎం జనగామ శ్రీనివాస్, ఎస్వోటు ఈ.డి కే వెంకటయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్స్ కే.వి శ్రీనివాస్, సుబ్బారావు, ఈ.ఈ అరుణ్, సీనియర్ ఇన్స్పెక్టర్ ఎం. సత్యనారాయణ రెడ్డి ఉద్యోగులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న సెక్యూరిటీ జీఎం చందా లక్ష్మీనారాయణ



సెక్యూరిటీ జీఎంను సన్మానిస్తున్న ఎస్‌టీపిపి అధికారులు